నేడు జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా రాక

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా బుధవారం జిల్లాకు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ జిల్లా తుని నుంచి ఉదయం 7 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 9.45 నిమిషాలకు భీమవరం చేరుకుంటారు. 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన భీమవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సమావేశంలో పాల్గొంటారు. తర్వాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు భీమవరం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తుని వెళతారని వెల్లడించారు.

సచివాలయ పోలీసులకు.. కోర్టు విధులు..!

డిజిపి, ఎస్‌పి ఆదేశాలు బేఖాతరు
పాలకోడేరు పోలీసుల తీరుపై సర్వత్రా చర్చ
కోర్టు విధులకు ముగ్గురు మహిళా పోలీసులు
ఉన్నతాధికారులు స్పందించేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులు) పోలీస్ విధులు కేటాయించొద్దని, ఆదేశాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డిజిపి, జిల్లా ఎస్‌పిలు ఆదేశాలు జారీ చేసినా కొంతమంది స్టేషన్ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలంలో సోమవారం చోటుచేసుకున్న పరిస్థితులే దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ఆ మండలంలో పాలకోడేరు, గొరగనమూడి, కుముదవల్లి సచివాలయాల పరిధిలో పని చేసే ముగ్గురు మహిళా పోలీసులకు సోమవారం భీమవరంలోని కోర్టు విధులు కేటాయించారు. దీంతో మహిళా పోలీసులు ఆ విధులకు హాజరయ్యారు. మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ ఉన్నతాధికారులిచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా కోర్టు విధులు కేటాయించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విషయం బయటకి పొక్కడంతో హడావుడిగా అధికారులు తమ తప్పేమీ లేదన్నట్లు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది ఈ ఒక్క స్టేషన్‌కే కాదని, ఇతర స్టేషన్లలోనూ మహిళా పోలీసులకు ఫోన్ చేసి కొంతమంది అధికారులు వివిధ రకాల పోలీస్ విధులను అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాలను సైతం అమలు చేయకపోవడంపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

యలమంచిలి : పడవపై శవపేటికను గ్రామానికి తెస్తున్న బంధువులు

గోదావరి తగ్గుముఖం

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి వరద కొద్ది రోజులుగా దోబూచులాడుతోంది. పెరుగుతూ, తగ్గుతూ, అటు యంత్రాంగాన్ని, ఇటు లంక గ్రామ ప్రజలను కలవరపెడుతోంది. రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి మంగళవారం సాయంత్రానికి ఆచంట మండలం కోడేరు వద్ద సుమారు మూడు అడుగుల మేర తగ్గుముఖం పట్టింది. దీంతో లంకగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి ఇంకా ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో లంక గ్రామాలకు పడవలపై ప్రయాణం నిషేధం ఇంకా కొనసాగుతోంది. దీంతో లంకగ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

యలమంచిలి : భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ మంగళవారం కూడా యలమంచిలి మండలంలో వరద నిలకడగా కొనసాగుతోంది. దీంతో గోదావరికి మధ్యలో ఉన్న కనకాయలంక గ్రామ ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ఏ అవసరం ఉన్నా పడవ దాటి దగ్గర్లో ఉన్న అంబేద్కర్ కోనసీమ జిల్లా వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా పడవ ప్రయాణాలకు భయపడి చదువు కంటే తమ పిల్లల ప్రాణాలే ముఖ్యమని చాలామంది తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపించకుండా ఇంటి దగ్గరే ఉంచుతున్నారు. దీంతోపాటు నిత్యావసర సరుకులు, తాగునీరు తెచ్చుకోవడానికి గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే గ్రామంలో ఎవరైనా చనిపోతే ఖననానికి వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి గుడిసె గోపాలరావు మరణించారు. ఈ నేపథ్యంలో వారి బంధువులు పడవ దాటి వెళ్లి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని జగ్గన్నపేట, రాజోలు వంటి ప్రాంతానికి వెళ్లి శవ పేటికను అటో ద్వారా ఏటిగట్టు వరకూ తెచ్చి అక్కడి నుండి పడవలో గ్రామానికి తీసుకొచ్చి, అక్కడి నుంచి ఇంటికి తీసుకురావడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చిందని గోపాలరావు బంధువులు వాపోయారు. దశాబ్దాలుగా గ్రామస్తులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పాలకులు ఉచిత హామీలు ఇవ్వడమే గాని వంతెన నిర్మించడంలో కృషి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మణిపూర్ ఘటనపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

దేశభక్తి, మహిళల పట్ల గౌరవం అంటూ బిజెపి చెబుతున్న మాటలకు, చేతలకూ పొంతనలేదని మణిపూర్ ఘటనలు రుజువు చేస్తున్నాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.బాబూరావు అన్నారు. మంగళవారం మావుళ్ళమ్మ గుడి సెంటర్లో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మణిపూర్ మహిళ బిజెపి ఓటు బ్యాంకు రాజకీయాల వల్లే ప్రారంభమైందన్నారు. రాజకీయాల కోసం, అటవీ సంపద కోసం అమాయకులైన గిరిజనుల తెగల మధ్య తంపులు పెట్టి కేంద్ర ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందన్నారు. రైతు నాయకులు లంకా కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు ఎం.వైకుంఠరావు, ఆకుల హరేరామ్, ఎం.రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, షేక్ వలీ, చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో రెండు జాతుల మధ్య జరుగుతున్న గొడవలను మత గొడవలుగా మార్చి రాజకీయ ప్రయోజనాల కోసమే మరణకాండగా సృష్టించడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి విమర్శించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక వరకూ కొవ్వొత్తుల ర్యాలీ, ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపీ మూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి రామకృష్ణ ప్రసాద్, సాయిరాం, కుమార్ బాబ్జి, రామకృష్ణంరాజు, ఏసుబాబు, క్రాంతికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులతో పాటు మరో 100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంటపాడు : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అవమానపర్చిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని, మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు

భీమవరం ప్రకాశం చౌక్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన నేతలు

డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా గాంధీ బొమ్మ సెంటర్లో అంగన్‌వాడీ, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగారావు, అంగన్‌వాడీ నాయకురాలు జై.శ్యామలాకుమారి, ఆశా వర్కర్, నాయకురాలు ఎం.సీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆదిలక్ష్మి, వి.నాగమణి, వై.ధనలక్ష్మి, గంటా మంగతాయారు, ఆర్.అనురాధ, పివి.ప్రసన్న, జై.సింహాచలం, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

గణపవరం: మణిపూర్ అల్లర్లను ఖండిస్తూ మంగళవారం కెవిపిఎస్, సిఐటియు, ఆల్ ఇండియా దళిత రైట్ ఫారం అంబేద్కర్ ఇండియా మిషన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పిప్పరలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్న నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు మేడిశెట్టి పెంటారావు, ఎఆర్‌డిఎఫ్ జిల్లా కార్యదర్శి బట్టు నాగరాజు, ఎఐఎం మండల కన్వీనర్ బళ్లారి అశోక్, ఎఐఆర్‌డిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట రమణ, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గుర్రం సుబ్బారావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : మణిపూర్ హింసాఖండను ఖండిస్తున్నామని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సంఘాల నాయకులు, రాష్ట్ర అధ్యక్షుడు మేదిడ జాన్సన్ అన్నారు. మణిపూర్ ఘటనపై మంగళవారం బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా, పట్టణంలోని అన్ని క్రైస్తవ సంఘాల నాయకులు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటువంటి మణిపూర్ ఘటనలను పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. మైనార్టీలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టా దేవరాజ్, వర్గీస్ దానియేలు, జొన్నగడ్డ శ్యామ్యూల్, వి.రమేష్‌బాబు, యుపిఎ ప్రెసిడెంట్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తణుకురూరల్ : మణిపూర్‌లో గిరిజన మహిళలపై అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించిన మానవ మృగాళ్లను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తణుకు పారిశుధ్య కార్మిక మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో అజ్జి అరుణాదేవి, ఎస్.పద్మ, నీలాపు అనంతలక్ష్మి, ఎల్లమిల్లి ధనలక్ష్మి, కె.రాజమ్మ, నీలాపు ఆదినారాయణ, మజ్జి కృష్ణబాబు, కొత్తపల్లి అయ్యప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, కామన మునిస్వామి, గార రంగారావు పాల్గొన్నారు.

ఉండి : మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ తనకేమీ పట్టనట్టు వ్యవహరించిన మోడీకి దేశ ప్రధానిగా కొనసాగే నైతిక హక్కు లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ ఉండి మెయిన్ సెంటర్లో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, గంజి రాజు, ఎస్.శ్రీనివాస్, కోన గొల్లయ్య పాల్గొన్నారు.

భీమవరంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

మోషేనురాజుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మణిపూర్ ఘటనకు కారకులను శిక్షించాలి

శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇటీవల మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. మంగళవారం భీమవరంలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగరిక సమాజంలో మహిళ పట్ల ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. మణిపూర్‌లో అసాంఘిక శక్తులు రేపిన హింసాకాండను అణచివేసి త్వరలోనే శాంతి భద్రతలు పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

మాట్లాడుతున్న రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు నాగేందర్

మోడీ ప్రభుత్వ విధానాలతో..

సంక్షోభంలోకి వ్యవసాయం

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేయాలి

ఎస్‌కెఎం జిల్లా సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

వ్యవసాయంలో నష్టాలు రావడానికి, రైతులు ఆత్మహత్యలు చేసు కోవడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలే కారణమని సంయుక్త కిసాన్ మహోత్సవం ఎస్‌కెఎం జిల్లా సదస్సు విమర్శించింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, రైతుల పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ బిగింపు ఆపాలని జిల్లా సదస్సు డిమాండ్ చేసింది. భీమవరం ప్యాడి రైస్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో రైతాంగ సమస్యలపై సంయుక్త కిసాన్ మహోత్సవం (ఎస్‌కెఎం) జిల్లా సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంక కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎర్నేని నాగేందర్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నేడు వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రైతు నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు. పాలా రామదాసు, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, అగ్రగామి కిసాన్ సభ నాయకులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎనిమిదేళ్లలో బిజెపి అవలంబిస్తున్న విధానాల కారణంగా ఎంతో నష్టం చేకూరిందన్నారు. బిజెపి విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. అనంతరం నాయకులు ఆకుల హరేరామ్, లంక కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, బి.రాం ప్రసాద్, రంగారావు వెంకటకృష్ణ, రామాంజనేయులు, జక్కంశెట్టి సత్యనారాయణ ,జెఎన్వి గోపాలన్, చినిమిల్లి వీరబాబు, కలింగ లక్ష్మణరావు, భీమాల శ్రీరామ్మూర్తి, జుత్తిగ నరసింహమూర్తి, చింతకాయల బాబూరావు, ఓదూరి భాస్కరరావు, దండు శ్రీనివాస్ రాజుతో 16 మంది సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్‌గా ఆకుల హరేరామ్ ఎన్నికైనట్లు జిల్లా సదస్సు ప్రకటించింది. 18 డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది. రానున్న కాలంలో నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో రైతాంగ కార్మిక సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని తీర్మానం చేశారు.

పర్యాటక కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలి : జెసి

ప్రజాశక్తి - ఆచంట

పెదమల్లం పర్యాటక కేంద్రంలో విద్యుత్, తాగునీరు, తదితర మౌలిక వసతులు త్వరితగతిన పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని పెదమల్లం పర్యాటక కేంద్రాన్ని, పర్యాటక భూములను మంగళవారం జెసి పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీనికి సంబంధించి మ్యాపులను పరిశీలించి అధికారులను పూర్తి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటక కేంద్రాలు అభివృద్ధి చెందితే యువతీ, యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయని, వీటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లు ఏడో నుంచి పదో తరగతి వరకూ, ఇంటర్ కళాశాల విద్యార్థులతో ఒక్కొక్క క్లబ్బుకు 25 నుండి 30 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు సంతృప్తి కరమైన సేవలదించాలన్నారు. ఆచంట -1, 2 గ్రామ సచివాలయాలను జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకురావాలని తెలిపారు. అనంతరం సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాల క్యాలెండరు, తదితర రిజిస్టర్లను పరిశీలించారు. అర్హుల జాబితాను ప్రతినెలా సచివాలయంలో అందరికీ కనబడేలా ప్రదర్శించాలన్నారు.

గోదావరి ఉధృతిని పరిశీలించిన జెసి

అలాగే గోదావరి వరద ఉధృతిని పరిశీలించి, పరివాహక గ్రామాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి ఏటిగట్లు పటిష్టతను పరిశీలించాలని, అనుమానం ఉన్నచోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ విఎస్‌విఎల్ జగన్నాథరావు, ఆర్‌ఐ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి డి.నాని, విఆర్‌ఒ శేషు పాల్గొన్నారు.

వీడని వర్షం

జిల్లాలో విస్తారంగా వర్షాలు

మరో రెండు రోజులపాటు భారీ వర్ష సూచన

స్తంభించిన జనజీవనం - ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలు విడడం లేదు. ఈ నేపథ్యంలో జనజీవనం స్తంభించిపోయింది. కార్మికులు, కర్షకులు చిన్నపాటి చిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. ముఖ్యంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నాట్లు, నారుమడులు నీటిలో నానుతున్న పరిస్థితి ఏర్పడడంతో ఆందోళన చెందుతున్నారు.

ఈ నెల 23 వ తేదీ రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ రోజు పనులకు వెళ్తే ఆరోజు వచ్చిన కూలితో పూట గడుపుకునే తమకు వర్షం వల్ల పనిలేక చేతిలో చెల్లిగవ్వలేక పూట గడవని పరిస్థితి ఏర్పడిందని వాపుతున్నారు.

జిల్లాలో మంగళవారం ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. జిల్లా కేంద్రమైన భీమవరంతోపాటు పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి, కాళ్ల, మొగల్తూరు, ఆచంట వీరవాసరం తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులపై నీరు చేరింది. భీమవరం బస్టాండ్, బాంబే స్వీట్ రహదారి, ప్రకాశంచౌక్, పాతబస్టాండ్, మావుళ్లమ్మ గుడి ప్రాంతాలతో పాటు రహదారులన్నీ చెరువులను తలపించాయి. మెంటేవారి తోటకి వెళ్లే రెండు అండర్ టన్నెల్, గునుపూడి, భీమవరం, తాడేపల్లిగూడెం రోడ్డులోని మరో అండర్ టన్నెల్‌లో వర్షపు నీరు భారీగా చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులకు వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఆందోళనలో రైతాంగం..

కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా సాగు ప్రారంభం ఆలస్యమైనప్పటికీ ముందుగా నాట్లు వేసిన పొలాలు ముంపు బారిన పడే అవకాశం ఏర్పడింది. ఇదిలా ఉంటే నారు

వర్షంతో చెరువును తలపిస్తున్న రోడ్డు

దశలో ఉన్న పొలాలు, నాట్లు సైతం రెండు రోజుల నుంచి నీటిలోనే నానుతున్నాయి. మంగళవారం కురిసిన వర్షానికి మరింత ముంపుబారిన పడ్డాయి. ముఖ్యంగా శివారు ప్రాంతంలోని పొలాల పరిస్థితి దారుణంగా తయారైంది. నాట్లు, నారుమడులు చెరువులను తలపిస్తున్నాయి. పాలకోడేరు, ఉండి, కాళ్ల, భీమవరం రూరల్, ఆకివీడు, ఆచంట, కాళ్ల, వీరవాసరం, మొగల్తూరు, పెనుమంత్ర, పోడూరు, తాడేపల్లిగూడెం మండలాల్లోని శివారు ప్రాంతాల్లో వరి పొలాలు ఎక్కువ శాతం ముంపు బారిన పడ్డాయి. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.13 నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఈ వర్షాలు నిండా ముంచుతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 248.4 మీల్లి మీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో 248.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 23.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పెంటపాడులో 9.4, తణుకులో 17, అత్తిలిలో 14.2, గణపవరంలో 14.8, పోడూరులో 12, వీరవాసరంలో 10.2, మొగల్తూరులో 6.2, కాళ్లలో 5.2, ఉండిలో 10.4, పాలకోడేరులో 12.4, పెనుమంత్రలో 12.8, ఇరగవరం, పెనుగొండలో 15.2, పాలకొల్లులో 17.6, యలమంచిలిలో 10.4, నరసాపురంలో 11.2, ఆకివీడులో 7, భీమవరంలో 10.4, ఆచంటలో 13.4, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు వాయుగుండంగా మరే అవకాశం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మంగళవారం అల్పపీడనంగా, బుధవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో, బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలతోపాటు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో మరో రెండు రోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

పాలకొల్లు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో మంగళవారం పాలకొల్లులో తీవ్రంగా చలిగాలులు వీస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి వర్షం ప్రభావం తగ్గిన చిరు జల్లులతో భారీ గాలులు వీస్తున్నాయి. దీంతో పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే మధ్యాహ్నం నుంచి తేలికపాటి వర్షం మొదలైంది.

పిఎంఎంఎస్‌వైతో లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ప్రయోజనాలు లబ్ధిదారులకు చేకూరేలా త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన జిల్లా స్థాయి కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఎంఎస్‌వై గ్రౌండింగ్‌లో జాప్యం కారణంగా లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. గ్రౌండింగ్‌లో జాప్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని మత్స్యశాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ పథకం కింద ఐస్ బాక్సులు, బోట్స్, వలలు అందజేయడం, మెరైన్ బోట్ యాక్టివిటీస్, కియోస్కులు ఏర్పాటుకు లబ్ధిదారులను గుర్తించి పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. డిసిసిబి, స్త్రీ నిధి ద్వారా సబ్సిడీ రుణాలను అందజేయాలన్నారు. మొదటి విడతలో 200 మంది లబ్ధిదారులు లక్ష్యం తీసుకోగా 223 ముందిని గుర్తించినట్లు తెలిపారు. 181 మందికి రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ కెవిఎస్‌ఆర్ రవికుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌విఎస్.ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ ఎడి ఇ.ఆనందరావు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

వరద బాధితులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, పెదలంక గ్రామాలను మంగళవారం ఎంఎల్‌ఎ టిడిపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో చిన్నపాటి వరదలు సంభవించినా లంక గ్రామాల ప్రజలందరికీ బియ్యం, కందిపప్పు, మంచి నూనె, కూరగాయలు వంటి నిత్యావసర సరుకులు అందించి ఆదుకునే వారమన్నారు. వైసిపి ప్రభుత్వం ఎంత పెద్ద ఎత్తున వరదలు వచ్చినా ప్రజలను గాలికొదిలేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు పాలకొల్లు నియోజకవర్గంలో మొట్టమొదటిగా కనకాయలంక బ్రిడ్జి నిర్మాణంతోనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి నాయకులు ముస్కుడి రాంబాబు, ముస్కుడి శ్యాంబాబు, కుందేటి గంగరాజు, కడలి సత్యనారాయణ, నిమ్మల శ్రీనివాస్, పులి శ్రీరాములు, పెదలంక సర్పంచి తాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ-2 కనకరాజు

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు అన్నారు. ఏలూరుపాడు హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులు రీడింగ్, రైటింగ్‌లో నైపుణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్ పిఎస్.రామకృష్ణ, ఏలూరుపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గొట్టుముక్కల వెంకట సత్యానారాయణరాజు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారయ్య దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - ఆకివీడు

ఇటీవల వృద్ధుల సంక్షేమ సంఘ రాష్ట్ర సహ అధ్యక్షులుగా ఎన్నికైన బంగారయ్యను సర్ ఆర్థర్ కాటన్ ఆకివీడు మండలం వృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. బంగారయ్య పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసం వద్దనే ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బంగారయ్య దంపతులను ఎరు సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు లయన్ జిల్లా మాజీ గవర్నర్, అంతర్జాతీయ లయన్ ప్రత్యేక ఆహ్వానితులు ఎంబి.సూర్యనారాయణరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సుబ్బారావు, సభ్యులు ఎస్.కోటేశ్వరరావు, నేరెళ్ల ఆదినారాయణ, పేర్ల ప్రసాద్, కృష్ణంరాజు, పోస్టుమాస్టర్ నవీన్, నేరెళ్ల రమణయ్య, టైపు రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఆ పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయులు పివిఎస్.సత్యనారాయణ, ఉషారాణి దంపతులు రూ.10 వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లుకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసినా పాఠశాలపైనా, విద్యార్థులపైనా అభిమానంతో పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డివి.ప్రసాద్, పి.ఎ.స్వామి పాల్గొన్నారు.

మహిళలే మహారాణులు : కొట్టు విశాల్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలే మహారాణులని, మహిళా శక్తిని మించిన మరొక శక్తి లేదని వైసిపి యువజన నాయకులు కొట్టు విశాల్ అన్నారు. తాడేపల్లిగూడెం వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో చిన్న తాడేపల్లి రోడ్డులో ఉన్న ఇంకూలు కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన లక్కీ లేడీస్ మెగా కిట్టి వనితల హంగామా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాసవి వనిత క్లబ్ మహిళలను సంఘటిత పరిచే ఇటువంటి విజ్ఞాన, వినోదాత్మకమైన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వాసవి వనిత క్లబ్ ప్రతినిధులు కొట్టు విశాల్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన చేతుల మీదుగా లక్కీ డిప్ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందించారు. ఆర్యవైశ్య ప్రముఖులు కె.శ్రీనివాసరావు, మారం వెంకటేశ్వరరావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవల్లి చెన్న నాగేంద్ర, పూర్వ అధ్యక్షులు ఒబిలి శెట్టి నటరాజ్, గ్రంధి సత్యనారాయణ, కోశాధికారి నున్న బాలత్రిపుర సుందరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు అభినందనీయం

పెనుగొండ :పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమని ఎస్‌వికెపి, డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల పాలకవర్గం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఈ నెల 23వ తేదీ ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సుకు 1974 నుంచి గత సంవత్సరం వరకు తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి హాజరయ్యారన్నారు. హైకోర్టు అడ్వకేట్ ఇందుగపల్లి రామానుజరావు, అనేక మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇటువంటి సదస్సులు నిర్వహించటం కళాశాల అభివృద్ధికి, అకాడమిక్ పరంగా మరింత పటిష్టం కావడానికి దోహదపడుతుందని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ప్రేమికురాలి తల్లి, తాతపై ప్రేమికుడి దాడి

యువతిని తీసుకెళ్లిపోయిన వైనం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రేమించిన యువతి తల్లి, తాతపై యువకుడు దాడి చేసి ఆమెను తీసుకెళ్లిన ఘటన మండలంలోని కొల్లేటి గ్రామం సిద్దాపురం శివారు కురుపాక ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్‌డి.బాబర్ కొల్లేటి గ్రామమైన సిద్దాపురం శివారు కురుపాక ప్రాంతంలో నివసిస్తున్నాడు. అతని కుమార్తె సయ్యద్ నబీకి వివాహం కావడంతో ఏలూరులో ఉంటుంది. ఇటీవల ఆమె తల్లి అనారోగ్యానికి గురైంది. ఈ క్రమంలో ఏలూరులో ఉంటున్న సయ్యద్‌నబీ తన కుమార్తె ఉక్సానా సుల్తానాతో కలిసి సిద్దాపురం వచ్చింది. ఈ క్రమంలో ఉక్సనాసుల్తానాకు అదే గ్రామంలో ఉంటున్న షేక్ ఇమ్రాన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. దీంతో సుల్తానాను తనకు ఇచ్చి వివాహం చేయాలని షేక్ ఇమ్రాన్ పెద్దలను కోరాడు. ఇందుకు సుల్తానా తల్లిదండ్రులు, తాత బాబర్ అంగీకరించలేదు. ఈ క్రమంలో షేక్‌ఇమ్రాన్ మంగళవారం ఇంట్లో ఉన్న బాబర్‌పై, సుల్తానా తల్లిపై ఇనుపరాడ్డుతో దాడి చేసి యువతిని బైక్‌పై తీసుకెళ్లిపోయాడు. గాయాలపాలైన ఇద్దరిని కుటుంబీకులు భీమవరం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి తెలిపారు.

వడ్డిగూడెంలో పెంకుటిల్లు దగ్ధం

వీరవాసరం :మండలంలోని వడ్డిగూడెంలో మంగళవారం తెల్లవారుజామున ఒక పెంకిటిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. గురదాసు పెద్దిరాజుకు చెందిన ఇంటి పైకప్పు పూర్తిగా కాలిపోయి మంటలు గదుల్లోకి వ్యాపించాయి. మంటలను గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఇంటి నుంచి బయటకు రావడంతో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న భీమవరం అగ్నిమాపక సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని వంట పాత్రలు, బట్టలు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. షార్టుసర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాద ప్రాంతాన్ని ఆర్ఐ రూజ్‌వెల్ట్, ఎస్ఐ రమేష్, సర్పంచి సైదు శ్రీనివాస్ సందర్శించి బాధితులను పరామర్శించారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి :మండలంలోని యండగండి శివారు చెరువుల దగ్గర ఉన్న కోళ్ల మకాంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ కొండా కోటేశ్వరరావు, ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు వారి బృందాలతో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,19,820 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

భార్య, పిల్లలు కన్పించడం లేదని ఫిర్యాదు

వీరవాసరం :తన భార్య, పిల్లలు కనిపించడంలేదని వీరవాసరం గ్రామానికి చెందిన హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వీరవాసరం చినిపేటకు చెందిన గండికోటి సలోమి ఇద్దరు పిల్లలను తీసుకుని ఈ నెల 12వ తేదీన ఆకివీడు వద్ద సిద్దాపురంలో తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడి నుంచి పిల్లలతో కలిసి బయటకు వెళ్లిన సలోమి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద ఎక్కడా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త హరికృష్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వర్షాలు.. అధ్వానంగా రోడ్లు

ప్రజల అవస్థలు

ఆచంటలో...

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆచంట కచేరి సెంటర్‌లో ఉన్న ఆచంట మార్టేరు ఆర్అండ్‌బి ప్రధాన రహదారి నీట మునిగింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలో ఈ వర్షాలకు ప్రధాన రహదారులు, లింక్ రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలో ఆచంట, కొడమంచిలి, కోడేరు, కందరవల్లి కరుగోరుమిల్లి భీమలాపురం వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, పలు గ్రామాల్లో ఈ వర్షాలకు రహదారులు అధ్వానంగా మారాయి. పలు పల్ల ప్రాంతాలు జలమలమయ్యాయి. నివాస ప్రాంతాల కాలనీల్లో సీసీ డ్రెయిన్‌లు నిర్మించకపోవడంతో వర్షాలకు ప్రధాన రోడ్లు సైతం జలమలమయమవుతున్నాయి. సీసీ రోడ్లు ఎత్తుగా నిర్మించడం వల్ల కచ్చా డ్రెయిన్‌లో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక సమీపంలోని గ్రావెల్ మెటల్ రోడ్లు నీట మునుగుతున్నాయి. దీంతో నివాస ప్రాంతాల చుట్టూ కూడా వర్షపు నీరు చేరుతుంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో అనేక అంటు రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారులపై నిలిచిపోతున్న వర్షపు నీటిని బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర : పొలమూరు నుంచి నౌడూరు సెంటర్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలకు ప్రధాన రహదారి అయినా అధికారులు స్పందించడంలేదని విమర్శిస్తున్నారు. నెలమూరు నుంచి మడుగు పోలవరం, పెనుమంట్ర నుంచి జుత్తిగ వెళ్లే రహదారి కూడా అధ్వానంగా ఉంది.

ఆకివీడులో...

ఆకివీడు : వర్షాలతో రోడ్లన్నీ మురికి గుంటలుగా మారాయి. రైల్వే స్టేషన్ రోడ్డు పరిస్థితి దుర్భరంగా మారింది. ఆకివీడు ప్రధాన జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్లే దొరగారు చెరువుగట్టు రోడ్డు మొత్తం చిన్న చిన్న చెరువులుగా మారింది. ఆ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. ఆ రోడ్డుపైన పది గ్రామాలకు చెందిన ప్రజానీకం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇక ప్రతినిత్యం రైల్వే స్టేషన్‌కు వచ్చి వెళ్లే వేలాదిమంది ఆ రోడ్డు గుండానే ప్రయాణించాలి. ఆ రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే రోడ్లపై గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

మొగల్తూరు : గ్రామాల్లోని పలు రహదారులపై వర్షపు నీరు నిలిచి మడుగులను తలపించాయి. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన మొగల్తూరులో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : జెసి

పెనుమంట్ర :ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మార్టేరు గ్రామం-1 సచివాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది హాజరు పట్టి, తదితర రిజిస్టర్లను ఆయన పరిశీలించారు.సచివాలయం బయట డిస్ ప్లే చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల జాబి తాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సేవలు పారదర్శకంగా అందించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వెలంగూడెం వార్డు సచివాలయం-9ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో ఏ సమస్య వచ్చినా సిబ్బంది ముందుండి తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, సచివాలయం, పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణమూర్తికి గుర్రం జాషువా పురస్కారం

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండకు చెందిన ప్రముఖ కవి, కథా రచయిత ఎంఆర్‌వి.సత్యనారాయణమూర్తికి, గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ దుగ్గిరాల వారు గుర్రం జాషువా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం, తెనాలి కవిరాజు పార్కులోని, సీనియర్ సిటిజన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సభలో తనకు గుర్రం జాషువా పురస్కారం అందించారని తెలిపారు.

సిపిఎం సానుభూతిపరుడు అప్పలరాజు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణానికి చెందిన కళాకారులు, సిపిఎం సానుభూతిపరుడు, యువజన సంఘాల్లో పనిచేసిన తూతిక అప్పలరాజు(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీలో కూడా చురుకుగా పనిచేసి ప్రజాసమస్యలపై పోరాడారు. ఆయన మృతికి సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, యర్రా అజయ్‌కుమార్, చల్లా సోమేశ్వరరావు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు

పాలకొల్లు రూరల్ : మండలంలోని ఉల్లంపర్రులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు ఆర్థిక సాయంతో ఉల్లంపర్రు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సుమారు రూ.పది వేల విలువైన నోటు పుస్తకాలు అందించారు. ప్రెసిడెంట్ రామ్మోహనరావు మాట్లాడుతూ తాను ఈ సంవత్సరం రోటరీ ప్రెసిడెంట్‌గా అయిన తర్వాత మొదటి కార్యక్రమంగా ఉల్లంపర్రు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు బుక్స్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు విద్య చాలా అవసరమన్నారు. ఈ ఏడాది స్కూల్ ప్రథమస్థానంలో నిలిచినవారికి స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల శ్రీవత్సవ ప్రదీప్, డిస్టిక్ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు చందక రాము, మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, కానూరు ప్రభాకరరావు, పోతాబత్తుల సత్యనారాయణ, స్కూలు విద్యా కమిటీ ఛైర్మన్ నాగలక్ష్మి, స్కూల్ హెడ్‌మాస్టర్ బాదంపూడి రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా తహశీల్దార్ అశోక్‌వర్మ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - పెనుమంట్ర

తహశీల్దార్ దండు అశోక్‌వర్మ పుట్టిన రోజు వేడుకలరను రెవెన్యూ అధికారులు స్థానిక కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మరింత ఉన్నత స్థితికి ఎదగాలని రెవెన్యూ అధికారులు ఆకాంక్షించారు. గ్రామ రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తానని తహశీల్దార్ దండు అశోక్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.ఏలియమ్మ, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాద్‌కు అబ్దుల్‌కలాం జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని శివదేవుని చిక్కాలకు చెందిన శివాలయం ప్రధాన అర్చకులు ర్యాలీ వెంకట శివరామకృష్ణ ప్రసాద్ డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం జీవిత సాఫల్య పురస్కారం అందుకోనున్నారని ఆయన సిబ్బంది తెలిపారు. ఈ నెల 27వ తేదీన విజయవాడ నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఈ పరిష్కారాన్ని తీసుకుంటారని తెలిపారు.

గమిని ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సీనియర్ లయన్ గమిని సుబ్బారావు గమిని ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. స్థానిక కొబ్బరితోటలో గమిని ఫంక్షన్ కార్యాలయంలో లయన్స్ జోన్ తరపున గమిని ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరొక అతిథి అంబికా రాజా మాట్లాడుతూ గమిని సేవలు ఆర్యవైశ్యులకే కాకుండా పేద ప్రజలకు అందాలన్నారు. అనంతరం గమినిని శాలువాలతో సత్కరించి మెమెంటో అందించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఛైర్మన్ మురళీకృష్ణంరాజు, జిల్లా నాయకలు నాయుడు, పదం కుమార్‌గుప్తా, నూకల నాగమల్లేశ్వరరావు వట్టిప్రోలు రాము, కొమ్ముల మురళీకృష్ణ, మదన్ మోహన్ అగర్వాల్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలో మహిళలకు పెద్దపీట : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

వైసిపి పాలనలోనే మహిళలకు పెద్దపీట వేస్తున్నారని, సంక్షేమ పథకాలన్నీ మహిళలకే అనుసంధానం చేసి ఇస్తున్నారన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి కూనపరాజు సీతమ్మ అప్పలరాజు లయన్స్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పివిఎల్.నరసింహరాజు పాల్గొని అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఉప సర్పంచి కల్యాణ్ వర్మ, రూరల్ బ్యాంక్ ఛైర్మన్ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర :అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని కొయ్యేటిపాడు, సత్యవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ సత్యవరం గ్రామంలో 605 కుటుంబాలకు 867 సర్టిఫికెట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యేటిపాడు సర్పంచి కర్రి మునిరామకృష్ణారెడ్డి, సత్యవరం సర్పంచి చుక్కా అప్పారావు, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి పాల్గొన్నారు.

గణపవరం :ప్రజా సమస్యలను సచివాలయ పరిధిలోనే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మండలంలోని మొయ్యేరు సచివాలయం వద్ద సర్పంచి కుటుంబరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష సభలో ఎంఎల్‌ఎ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, వైఎస్ఆర్ మండల కన్వీనర్ దండు రాము, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, తహశీల్దార్ పి.లక్ష్మి, డిటి ఎం.సన్యాసిరావు, ఎంపిటిసి సభ్యులు ద్వారపూడి లక్ష్మివిజయ పాల్గొన్నారు.

పాలకోడేరు :మండలంలోని విస్సాకోడేరు, శృంగవృక్షం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. విస్సాకోడేరులో నిర్వహించిన కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు చంటిరాజు, సర్పంచి బొల్లా శ్రీనివాస్ శృంగవృక్షం సర్పంచి జంగం సూరిబాబు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ మురళి గంగాధరరావు, ఆర్ఐ నాగభూషణరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు చేరుస్తామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని జగన్నాథపురం, కెపిపాలెం నార్త్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ధ్రువపత్రాలు అందించారు.

జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో తనిఖీలు

భీమవరం రూరల్ :మండలంలోని తాడేరు గ్రామపంచాయతీ పరిధిలో డిఆర్‌డిఎ శాఖకు అనుబంధంగా ఉన్న జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. విచారణ అధికారిగా ఎస్ఇఆర్‌పి, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ ప్రాపర్టీ (సర్ఫ్) ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి విజయవాడ వారి బృందంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అత్తిలి మండలం వెలుగు సర్ఫ్ ఎపిఎంగా పనిచేస్తున్న అధికారి ప్రభుత్వ నిధులకు గండి కొడుతున్నారన్న ఆర్‌టిఐ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర సెక్రటరీ కె.రవికుమార్ ఫిర్యాదు మేరకు ఈ విచారణ నిర్వహించారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - తణుకు రూరల్

పేద కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు జగనన్న సంక్షేమ పథకాలు దోహదపడుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల శాఖా మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. ఇరగవరం మండలంలోని కావలిపురం గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం ఎంపిపి కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డిసిఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని బంద్

ప్రజాశక్తి - ఆకివీడు

అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎఐఎస్ఎఫ్) పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక విద్యా సంస్థలు మూతపడ్డాయి. మండల కేంద్రమైన ఆకివీడు పట్టణంలో అన్ని ప్రయివేట్ విద్యాసంస్థలు మూతపడినప్పటికీ దుంపగడప ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు యధాతథంగా పనిచేశాయి. మండలంలోని మారుమూల గ్రామాల్లో పాఠశాలలు సైతం నడిచాయి.

భీమవరం రూరల్ : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే విషయంలో జగన్ విఫలమయ్యారని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాండ్రు సందీప్ అన్నారు. భీమవరంలో పలు ప్రయివేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యా సంస్థలను మూయించివేశారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరు ఉధృతం చేస్తామని తెలిపారు.

పాలకొల్లు :పాలకొల్లులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బంద్ చేస్తున్న ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బంద్‌లో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పవన్, నరసాపురం కార్యదర్శి సాయి, పాలకొల్లు అధ్యక్ష కార్యదర్శులు మణిదీప్ , పెద్దిరాజు, రాంప్రసాద్ జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, నాయకులు సత్య, సంతోష్, మనోజ్ కుమార్, బన్ని, రాజా పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను, ఆచంట ఎంవిఆర్ జూనియర్ కళాశాలను తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ అధికార ప్రతినిధి మన్నే తేజ ఆధ్వర్యంలో మూయించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఆచంట మండల అధ్యక్షులు కేతా మురళి, వర్దనపు హరి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కంకటాల ఉదయ్, చిలుకూరి ప్రసన్న, నెక్కంటి అరుణ్, కుసుమే అరుణ్‌కుమార్, ఎం.అంజి, బైరిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

ఉండి :మండలంలో విద్యాసంస్థల బంద్ పాక్షికంగానే జరిగింది. మండలంలోని ప్రయివేట్ పాఠశాలలు తప్ప ప్రభుత్వ పాఠశాలలు యధాతథంగా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి దానం విద్యాసాగర్, జిల్లా ఉపాధ్యక్షులు వెలగపల్లి టోనీబాబు మాట్లాడారు.

తాడేపల్లిగూడెం :సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించకపోతే పోరు ఉధృతం చేస్తామని ఎఐఎస్ఎఫ్ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షులు వర్రే అజయ్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌లో భాగంగా తాడేపల్లిగూడెంలో పలు ప్రయివేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థలను మంగళవారం ఎఐఎస్ఎఫ్ నాయకులు మూయించివేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - ఆకివీడు

మంచినీటి చెరువులో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారంటూ చేసిన ఫిర్యాదుపై ఏ విధమైన చర్యలు లేకుండానే తమను కమిషనర్ ఫిర్యాదు ఉపసంహరించుకోమనటం విడ్డూరంగా ఉందని టిడిపి పట్టణ అధ్యక్షులు బొల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పార్టీ నాయకుడు బత్తుల రవీంద్రబాబు, పార్టీ కౌన్సిలర్లు ఇసుక అక్రమ తరలింపుపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఏ విధమైన చర్యలు తీసుకోలేదని, ఎంత ఇసుక తరలించారని, ఎంత సొమ్ము వసూలు చేయాల్సి ఉందనే విషయాలు ఇంకా తేల్చలేదన్నారు. ఈ విషయాలు తేల్చకుండానే కేసు ఉపసంహరించుకుంటున్నట్లుగా వేలిముద్ర వేయమని ఫిర్యాదుదారులను కమిషనర్ ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. పూర్తిస్థాయి విచారణ జరపాలని తాము జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

'టిడిపితోనే మహిళా సాధికారత'

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపితోనే మహిళా సాధికారత సాధ్యమని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో వరుస హత్యలు, అత్యాచారాలతో మహిళలు రోడ్డు మీదకు రాలేకపోతున్నారన్నారు. ఒంటరి మహిళ పెన్షన్, రేషన్ కార్డుల రద్దు, సంక్షేమ పథకాల కోతలతో మహిళా ద్రోహిగా జగన్ నిలబడ్డారని చెప్పారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, భీమడోలు గ్రామం, డోర్ నెం. 10-50 నివాసి **కొమ్మోజి అరుణ దేవి C/o.** వీరభద్రాచారి కి చెందిన ఒరిజినల్ **దస్తావేజు నెంబర్ 6544/2010** జిరాక్స్ తీసుకొను నిమిత్తం సెంటర్‌కి వెల్లుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. కావున దొరికిన వారు క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

సెల్: 70952 36417

బ్యాగు పోయినది

పాలకొల్లు మండలం, వెలివెల గ్రామ కాపురస్తులు గుమ్మాపు నరసింహారావు గారి కుమారుడు సూర్య వరప్రసాదరావు అను నేను తెలియచేయుచున్నది ఏమనగా నేను **ది. 24-07-2023** సం॥రం తేదీన నేను నా స్వగ్రామము అయిన వెలివెల నుండి పాలకొల్లు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళు సమయము నందు నా పేరున గల గునుపూడి సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు రిజిష్ట్రీ కాబడిన **దస్తావేజు నెం. 6107/2019** రును మరియు నా ఆధార్ కార్డు గల బ్యాగు నా బండి నుండి జారిపోయినది. గాన సదరు బ్యాగు ఎవరికైననూ దొరికిన యెడల యీ క్రింది అడ్రస్సుకు తెలియపర్చగలరు.

అడ్రస్సు: **గుమ్మాపు సూర్య వరప్రసాదరావు**
తండ్రి: నరసింహారావు, వెలివెల గ్రామం
పాలకొల్లు మండలం,
సెల్: 9856299993, 8333951155

సర్టిఫికెట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, దుంపగడప గ్రామం కొక్కిరగడ్డ శ్రావణి, తండ్రి: కొక్కిరగడ్డ రమేష్ అను నా ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ పోయినది. **సర్టిఫికెట్ నెం. 121537, రోల్ నెం. 1305241666 గల ఒరిజినల్ సర్టిఫికెట్ ది.13-07-2023వ** తేదీన జిరాక్సు తీయించుకోను నిమిత్తం దుంపగడప మా గ్రామం నుండి ఆకివీడు సెంటరుకు వెళ్ళుచుండగా నా ఒరిజినల సర్టిఫికెట్స్ ఉన్న ఫైలు పోగొట్టుకున్నాను. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కొక్కిరగడ్డ శ్రావణి
తండ్రి: రమేష్, దుంపగడప,
ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 93472 28829

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P.No. 24/2018

పిటీషనరు:
యాళ్ళబండి వెంకట గిరిరావు
రెస్పాండెంట్లు:
దండు సుబ్బరాజు వగైరా
3వ రెస్పాండెంటు:
దండు హర్షిత విజయ భాస్కరరాజు, తండ్రి: సుబ్బరాజు, డో.నెం. 27-5-10, పోస్టు ఆఫీసు రోడ్డు, శివరావుపేట, భీమవరం-2, ప॥గో॥జిల్లా.

పిటీషనరు దాఖలు చేసిన పై నెంబరు ఐ.పి.నందు 3వ రెస్పాండెంటు అయిన మీకు ఆక్షేపణలు /వాదన ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.10-08-2023వ తేదీన పగలు 10:30 ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను.** లేని పక్షమున మీకు పరోక్షంగా నిర్ధారణ కాబడును.

గంధం వీర వెంకట నాగేశ్వరరావు
అడ్వకేట్, భీమవరం, ప॥గో॥జిల్లా.

SUMMONS
(Order 5 Rule 1, 5 and 20 of C.P.C)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BHIMAVARAM W.G.District,ANDHRA PRADESH
OS No.336/2018

Between:
M/s Real Grow Exims Private Limited,
Represented by its Director, Seesali village, Kalla Mandal, W,G District, AP. ...Plaintiff
AND
K.N.V.Prasad,
C/O Vinayaka Brokers, Chintalapudi, W.G Dist-534460. ......Defendant

To,
K.N.V.Prasad, C/O Vinayaka Brokers, Chintalapudi, W,,G Dist-534460.Whereas the Plaintiff has instituted the above Suit against you for the relief mentioned in the Plaint therein, you are hereby summoned to appear in the Court in person or by a pleader on the 3rd day of August 2023 (03-08-2023) at 10.30A.M before the above Court.

Take notice that in default of your appearance on the day mentioned above the Suit will be heard and determined in your absence.

Published as per the orders of the Honourable Court

Bhimavaram.
25.07.2023
S Naga Babu,
Advocate , Bhimavaram.